క్లుప్తంగా

అడవులను కాపాడండి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

రొద్దం: మండల పరిధిలోని శ్యాపురం, కంబాలపల్లి, కోగిర బీదానిపల్లి తదితర గ్రామాల పరిధిలో ఉన్న కల్పవల్లి సంరక్షిత ప్రాంతం అడవి అక్రమాలకు గురికాకుండా కాపాడాలని కల్పవల్లి సొసైటీ సభ్యులు సోమవారం తహసీల్దార్ అనంతాచారికి వినతిపత్రం సమర్పించారు. 1992 నుంచి టింబక్టు–కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఆయా గ్రామాల్లో వన సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి పచ్చదం పెంచుతున్నట్లు చెప్పారు. అయితే అడవులను కొందరు అక్రమార్కులు ఆక్రమించుకోవాలని ప్రయత్నం చేస్తున్నట్లు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు.

మెరుగైన వైద్యం అందేలా చూడండి

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని తరచూ తనిఖీ చేస్తూ రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని మానవ హక్కుల రాష్ట్ర ఉపాధ్యక్షులు రవూఫ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రామాంజినేయులు , నరసింహులు, సీరాఉద్దీన్ తెలిపారు. ఈమేరకు వారు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏట రమణకు వినతిపత్రం అందించారు. ఆదివారం ఆస్పత్రిలో వైద్యులు లేక ఇస్లాపురంకు చెందిన క్యాన్సర్ రోగి రమక్క ఇబ్బంది పడిందన్నారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని ఇప్పటికై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు లక్ష్మినారాయణ, ఎంఎస్ మూర్తి ,శేషు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం



విద్యార్థి తండ్రికి ఆర్థికసాయం అందజేస్తున్న పాఠశాల సిబ్బంది

గుడిబండ: అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థికి వైద్య ఖర్చులకు పాఠశాల విద్యార్థులు, సిబ్బంది డబ్బులు అందజేసి మానవత్వం చాటుకున్నారు. వివరాలు.. మండల పరిధిలోని కే.ఎన్.పల్లికి చెందిన తిమ్మరయప్ప, దీపారాణి కుమారుడు మనోహర్ మెదడు సంబంధిత వ్యాధితో నెల రోజులుగా బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న రవీంద్ర విద్యానికేతన్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ కలిసి రూ.1,21,470ను మనోహర్ తండ్రికి అందజేశారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



బంగారు, సిల్వర్ పతకాలు సాధించిన కమల్‌సాయి, హితేష్

రొద్దం: మండల పరిధిలోని ఆర్ మరువపల్లి గ్రామానికి చెందిన కురుబ సోమశేఖర్ కుమారులు జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ కనపరిచి బంగారు పతకం సాధించినట్లు కరాటే మాస్టర్ రామచంద్ర తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో 21వ జాతీయ కరాటే పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో మరువపల్లికి చెందిన ఆరో తరగతి విద్యార్థి కమల్‌సాయి, 8వ తరగతి విద్యార్థి హితేష్ బంగారు, సిల్వర్ పతకాలు సాధించినట్లు వివరించారు. సినీనటుడు సుమన్ చేతులమీదుగా గోల్డ్ మెడల్, షీల్డ్ అందుకున్నారన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి



పాలసముద్రం ఉన్నత పాఠశాలలో నాడు నేడు పనులను పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

గోరంట్ల: మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాల్లో మనబడి నాడు నేడు కార్యాక్రమంలో భాగంగా ఫేజ్ టూ కింద చేపట్టిన పనులను సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి పరిశీలించారు. ఈ సందర్భంగా పాలసముద్రం, మండలపల్లి, గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించడంతో పాటు అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు జాన్‌రెడ్డప్ప, గోపాల్, ఇరిగేషన్ డివిజినల్ ఇంజనీర్ లక్ష్మినారాయణ, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యయులు పాల్గొన్నారు.

రెండోరోజూ సాగిన గణేశ్ నిమజ్జనం

- చివరి విగ్రహాలను నిమజ్జనం చేసే విషయంలో వివాదం
- రోడ్డుపైనే నాలుగు భారీ గణనాథుల నిలిపివేత
- నాయకుల చర్చలతో సమస్య కొలిక్కి
- సోమవారం అర్ధరాత్రి దాకా సాగిన నిమజ్జనోత్సవం



వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



కోనేరు వద్దకు చేరిన గరిడి, సూరప్పకట్ట భారీ విగ్రహాలు

హిందూపురం: హిందూపురంలో వినాయక నిమజ్జనోత్సవం రెండు రోజుల పాటు ఎంతో వైభవంగా జరిగింది. ఆదివారం 4 గంటల నుంచి మొదలైన శోభాయాత్ర సోమవారం అర్ధరాత్రి దాకా కొనసాగింది. సోమవారం మధ్యాహ్నం పట్టణంలోని అన్ని విగ్రహాల నిమజ్జనోత్సవం ముగింది. అయితే చివరి విగ్రహం కన్నా ముందు నిమజ్జనం చేసే విగ్రహం విషయంలో వివాదం తలెత్తింది. దీంతో ముక్కిడిపేట, బాపూజీనగర్, సూరప్పకట్ట, గరిడి గణపతులు బైపాస్‌రోడ్డు మున్సిపల్ ఆఫీసు వద్ద నిలిచిపోయాయి. తామంటే తాము విగ్రహాన్ని నిమజ్జనం చేస్తామని బాపూజీనగర్, సూరప్పకట్ట నిర్వాహకులు పట్టుబట్టారు.

పలు దఫాలు చర్చలు

విగ్రహ నిమజ్జన విషయంపై డీఎస్పీ కంజాక్షన్, సీఐలు, ఇతర పోలీసు అధికారులు నిర్వాహకులతో ఎన్నిసార్లు చర్చించినా ఎవరూ వెనక్కు తగ్గలేదు. ఆఖరికి మీరే తేల్చుకోండని పోలీసులు కూడా వదిలేశారు. చివరికి నాయకులు జోక్యం చేసుకుని నిర్వాహకులతో చర్చించి సమస్యను కొలిక్కి తెచ్చారు. మొదట ముక్కిడిపేట గణపతి తర్వాత బాపూజీనగర్, ఆ తర్వాత సూరప్పకట్ట గణపతి నిమజ్జనం చేద్దామని, చివరిగా గరిడి గణేశుడిని నిమజ్జనం చేసేలా నిర్వాహకులతో చర్చించి ఒప్పించారు.



గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



విగ్రహాల నిమజ్జనాన్ని వీక్షిస్తున్న ప్రజలు

గరిడి గణేశుడు నిమజ్జనంతో..

సమస్య పరిష్కారమైన తర్వాత గణపతి విగ్రహాలు కోనేరు వద్దకు కదిలాయి. ముక్కిడిపేట భారీ గణపతి, తర్వాత బాపూజీనగర్ గణేశుడు, ఆ తర్వాత సూరప్పకట్ట మహాగణపతిని నిమజ్జనం చేశారు. చివరగా గరిడి గణేశుడు నిమజ్జనంతో హిందూపురం గణేష్ ఉత్సవాలు ముగిశాయి. రెండు రోజుల నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో పట్టణ ప్రజలు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

విగ్రహాలు మునిగేలా చర్యలు

కోనేరులో నీటి నదుపాయం ఉన్నా భారీ విగ్రహాలను కోనేరు మధ్యకు తీసుకెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతుండటంతో వాహనాల పైనుంచి విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేశారు. దీంతో భారీ విగ్రహాలు నీటిలో సగానికే మునిగాయి. నీటిలో పూర్తి మునగని విగ్రహాలను తాడు కట్టి కోనేరు ఓ మూలకు తీసుకెళ్లి నీటిలో ముంచేలా చర్యలు తీసుకున్నారు.

ముస్లిం రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఉమర్ ఫారూక్



హిందూపురం టౌన్: ముస్లిం రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన కవి, రచయిత ఉమర్ ఫారూక్ ఖాన్ ఎన్నికయ్యారు. సోమవారం కార్యవర్గ ఎన్నికలో భాగంగా ఆ సంఘం వ్యవస్థాపకుడు కవి, రచయిత కరీముల్లా ఉత్తర్వులు విడుదల చేశారని ఉమర్ ఫారూక్ తెలిపారు. మతసామరస్యం, సామాజిక, సాహిత్య చైతన్యం, తెలుగు భాషాభివృద్ధి వంటి లక్ష్యాలతో భారత రాజ్యాంగ విలువలకు కట్టుబడి ముస్లీం రచయితల సంఘం పనిచేస్తుందన్నారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకొన్న కవులు, రచయితలు, తెలుగు భాషాభిమానులకు ఉమర్ ఫారూక్ కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన



అమరాపురంలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలోని వినాయక నగర్‌లో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మంటపంలో సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు హరీష్‌భట్టాచార్యులు బొజ్జ గణపయ్యకు వివిధ రకాల అభిషేకాలు, సూక్త హోమం, శాంతి హోమం, అష్టోత్తర నామాలను భక్తులకు చదివి వినిపించారు. అలాగే చోళమాంబదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం మహా మంగళ హారతి ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గణపయ్య, చోళమాంబదేవిలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

విద్య, వైద్య రంగానికి పెద్దపీట

- ఎమ్మెల్యే తిప్పేస్వామి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: రాష్ట్రంలో విద్య, వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. సోమవారం అసెంబ్లీలో క్వశ్చన్ అవర్‌లో విద్యాదీవెన, వసతి దీవెన పథకాలపై ఆయన మాట్లాడారు. విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. వైఎస్సార్ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేసి పేద విద్యార్థులను ఆదుకున్నారని తెలిపారు. అదే తరహాలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఎంతో మంది విద్యార్థులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని చదువుకొంటున్నట్లు పేర్కొన్నారు. విద్య రంగంలో తీసుకొచ్చిన మార్పుల వలన రాష్ట్రం, సమాజం అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడిందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యకు రూ.28,801 కోట్ల నిధులను ఖర్చు పెట్టిందని , ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే సాధ్యమైందని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా విద్యారంగానికి ఇంత పెద్దస్థాయిలో నిధులు ఖర్చు పెట్టలేదన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



రొళ్ల: మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు చిన్నపయ్యా

హిందూపురం టౌన్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన ముద్దిరెడ్డిపల్లి సౌత్ పాఠశాల ఉపాధ్యాయురాలు ఎడిత్ రోజ్‌ను సోమవారం ఘనంగా సత్కరించారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకళ అధ్యక్షతన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓలు గంగప్ప, ప్రసన్న లక్ష్మీలు పాల్గొని ఎడిత్ రోజ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, సీఆర్‌పీ సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను సోమవారం సాయంత్రం పాఠశాల తరుపున ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు చలపతి, పుష్పలత, భారతి, ఫిజికల్ డైరెక్టర్ ఓబులేసు తదితరులను పూలమాలతో సత్కరించారు. వక్తులు మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తే సమాజంలో గుర్తింపు సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్నేహలత మార్గరేట్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు



క్రీడల్లో సత్తాచాటిన విభిన్న ప్రతిభావంతులతో హెచ్‌ఎం కృపాసత్యరాజు

పరిగి: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో చదువుతున్న విద్యార్థులు జిల్లా స్థాయి ఆటల పోటీల్లో సత్తాచాటారు. ఇటీవల జిల్లాలోని కొత్తచెరువులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి ఆటల పోటీల్లో పరిగి భవిత కేంద్రంలో చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో రన్నింగ్ రేస్‌లో మహమ్మద్ ఆలీ, మహమ్మద్ తన్వీర్ యూసూఫ్‌ఖాన్, నిత్యశ్రీ పాల్గొని విజయం సాధించారు. అలాగే షాట్‌పుట్‌లో ముదుసిరా, షాట్‌బాల్‌లో వంశీ, స్లోవాకింగ్‌లో హేమంత్‌కుమార్ విజేతలుగా నిలిచారు. ఈ క్రమంలో సోమవారం పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కృపా సత్యరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని వక్తలు తెలిపారు. అనంతరం బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మూర్లప్ప, భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు మమత తదితరులు పాల్గొన్నారు.

చోరీకి విఫలయత్నం



పట్టుబడ్డ యువకుడు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని హరినాథ్‌రెడ్డి కాంప్లెక్స్ వద్ద పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని అపహరించేందుకు ఓ యువకుడు యత్నించిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. సోమందేపల్లికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని హరినాథ్‌రెడ్డి కాంప్లెక్స్ వద్ద ఉంచాడు. అయితే ఓ యువకుడు వాహనాన్ని ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నం చేసినట్టు కాంప్లెక్స్ నిర్వాహకులు గుర్తించారు. అతని కదలికలను సీసీ కెమెరాల్లో పరిశీలించి పోలీసులకు ఆ యువకుడిని అప్పగించారు. నేపాల్‌కు చెందిన ఆ యువకుడు వారం రోజులుగా కూలి పనుల కోసం సోమందేపల్లిలో తిరుగుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

యువతి అదృశ్యం

పరిగి: మండల కేంద్రమైన పరిగిలో సునీత అనే యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. గత శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన సునీత ఇంటికి వెళ్లకపోవడంతో తల్లి రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పెట్రోల్ బాటిల్‌తో రైతు నిరసన



మడకశిర: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం మండలంలోని యూ రంగాపురం గ్రామానికి చెందిన మల్లారెడ్డి అనే రైతు పెట్రోల్ బాటిల్‌తో నిరసన తెలిపారు. తనకు దక్కాల్సిన వ్యవసాయ భూమిని ఇతరులకు హక్కు కల్పించకూడదని కోరుతూ రైతు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని వైబీహళ్లి పంచాయతీ పరిధిలోని జాడ్రహళ్లిలో తన తాత కరియన్నకు 1967లో ప్రభుత్వం 4.30 ఎకరాల భూమిని కేటాయించిందని బాధితుడు తెలిపారు. ప్రస్తుతం కూడా అదే భూమిపై ఆధారపడి జీవిస్తున్నామన్నారు. అయితే ఈ భూమిని ఇతరులకు హక్కు కల్పించడానికి రెవెన్యూ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. తనకు నోటీసులు కూడా ఇచ్చారని తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని న్యాయం చేయకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడతానని హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకుని తహసీల్దార్ ముర్షావలి ,డిప్యూటీ తహసీల్దార్ బాలాంజినేయులు వెంటనే రైతు వద్దకు వెళ్లి మాట్లాడారు. ప్రస్తుతం పారదర్శకంగా భూ సర్వే నిర్వహిస్తున్నామని, ఎవరి భూమి వారికి దక్కే విధంగా చర్యలు తీసుకుంటామని బాధిత రైతుకు హామీ ఇవ్వడంతో రైతు నిరసన విరమించారు.

మండల కన్వీనర్ల నియామకం



సాధిక్, పట్టణ కన్వీనర్-1



బెల్లం నరేష్ , పట్టణ కన్వీనర్-2



నారాయణస్వామి, లేపాక్షి



సానె ప్రభాకర్ రెడ్డి, చిలమత్తూరు



రాము, హిందూపురం

హిందూపురం: నియోజకవర్గంలోని హిందూపురం, చిలమత్తూరు, లేపాక్షి మండలాలకు నూతనంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లను నియమించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశానుసారం కన్వీనర్ల నియామకం చేపట్టామన్నారు. హిందూపురం పట్టణ కన్వీనర్ –1గా సీఎం సాధిక్, కన్వీనర్–2గా వాల్మీకి బెల్లం నరేష్, హిందూపురం మండల కన్వీనర్‌గా రాము, లేపాక్షి మండల కన్వీనర్‌గా నారాయణ స్వామి, చిలమత్తూరు మండల కన్వీనర్‌గా సానె ప్రభాకర్‌రెడ్డి లను నియమించామన్నారు.

సంక్షిప్తం

ఎస్పీ బాలుకు ఘన నివాళి

పరిగి: గానగంధర్వుడు పద్మశ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మూడో వర్ధంతిని సోమవారం పరిగి పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కళాకారుల సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు రామలింగప్ప నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో తొలుత ఎస్పీబీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన పాటలను కళాకారులు ఆలపించి శ్రోతలను అలరించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్ర, సర్పంచ్ లక్ష్మీదేవి, ఏఐసీసీ మెంబర్ కేటీ శ్రీధర్, ఎంపీటీసీ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతు

మడకశిరరూరల్: మండల పరిధిలోని గొడనహళ్లిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టామని సర్పంచ్ పుట్టమ్మ తెలిపారు. తాగునీటి పైపులైన్ ద్వారా నీరు రాకపోవడంతో సోమవారం దెబ్బతిన్న పైపులైన్ మరమ్మతు చేయడానికి జేసీబీతో మట్టిని తీసి పైపులైన్ మరమ్మతులు పనులు చేపట్టామని చెప్పారు. మరమ్మతు పూర్తవగానే కొళాయిలకు తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.

ఎంఎస్.మూర్తికి సేవా రత్న పురస్కారం

పెనుకొండ: పట్టణానికి చెందిన ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ సభ్యుడు, మాల మహానాడు నాయకుడు ఎంఎస్. మూర్తి సేవా రత్న పురస్కారం అందుకున్నారు. సికింద్రాబాద్‌లోని ఎల్డర్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆల్‌ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ వారు ఆయనకు ఉత్తమ సేవా పురస్కారాన్ని అందించారు. ఆదివారం రాత్రి జరిగిన ఓ కార్యక్రమంలో ఆయనకు పురస్కారాన్ని అందజేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

పావగడ: తాలూకా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికశాఖ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కర్ణాటక రాజ్య భవన నిర్మాణ కార్మికుల సంఘం తాలూకా అధ్యక్షుడు రామాంజినప్ప ఆధ్వర్యంలో కార్మికశాఖ అధికారి అబ్దుల్ రవూఫ్‌కు వినతిపత్రం అందించారు.

హద్దులు చూపించండి

లేపాక్షి: మండలంలోని పి.సడ్లపల్లిలో అన్యాక్రాంతం అవుతున్న రస్తా పొరంబోకు స్థలాన్ని కాపాడాలని ఆ గ్రామానికి చెందిన సోమశేఖర్, నాగరాజు, వెంకటేశులు తహసీల్దార్ బాబుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. 166-3, 163-1 సర్వేనంబర్లలో రస్తా పొరంబోకు ఉందని, అయితే దీన్ని కొంతమంది ఆక్రమించి ప్రహరీ , ఇతర కట్టడాలు నిర్మించుకుంటున్నారని తెలిపారు. దీంతో ఎగువ ఉన్న కుటుంబాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారిందని, స్థలాన్ని సర్వే చేసి హద్దులు చూపించాలని కోరారు.

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం ర్యాలీ

లేపాక్షి: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా లేపాక్షిలోని ఏపీ టూరిజం శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నట్లు మేనేజర్ లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, విద్యార్థులు హాజరవుతారని తెలిపారు.

ఈఓఆర్డీగా బాధ్యతలు స్వీకరించిన ఈశ్వరయ్య



చిలమత్తూరు: మండల ఈఓఆర్డీగా ఈశ్వరయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బత్తలపల్లి మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై ఆయన చిలమత్తూరు ఈఓఆర్డీగా వచ్చారు. మండలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నట్లు తెలిపారు.

జగనన్న లేఅవుట్‌లో తాగునీటి బోరు



జగనన్న కాలనీలో నీరు పడడంతో పూజలు చేస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో తాగునీటి కోసం సోమవారం నూతనంగా బోరు ఏర్పాటు చేశారు. 600 అడుగులు బోరు వేయగా 2 ఇంచులకు పైబడి నీరు సమృద్ధిగా పడినట్లు ఎంపీపీ చంద్రశేఖర్ చెప్పారు. ఇప్పటికే జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు నీటి సమస్య లేకుండా బోరు ఏర్పాటు చేశామన్నారు. నీరు సమృద్ధిగా పడటంతో ఎంపీపీ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సోని, హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ రంగస్వామినాయక్ గంగమ్మకు పూజలు చేశారు.

ఘనంగా అక్కమ్మగార్ల విగ్రహ ప్రతిష్ట



అక్కమ్మగార్ల ఆలయం వద్ద భక్తజనసందోహం



అక్కమ్మగార్లకు పూజలు చేసిన దృశ్యం

చిలమత్తూరు: మండలంలోని వడ్డిచెన్నంపల్లి సమీపంలో పెక్కాల చెరువు వద్ద అక్కమ్మగార్ల విగ్రహాల ప్రతిష్ట వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అమ్మవార్ల దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

నేడు మారెమ్మ ఉత్సవాలు

అమరాపురం: మండలంలోని పుల్లికుంట, గొడనకుంట, దేవగానపల్లి, నగోనపల్లి, ఉదుగూరు, కాచికుంట, హలుకూరు, మద్దనకుంట, అమరాపురం గ్రామాల్లో మంగళవారం మారెమ్మ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆయా గ్రామాల్లో మారెమ్మ ఆలయాలను శుభ్రం చేసి ఉత్సవాలకు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

బీఎల్‌ఓలతో సమీక్ష

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం సాయంత్రం బూత్ లెవెల్ అధికారులతో తహసీల్దార్ హసీనాసుల్తానా సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ హసీనాసుల్తానా మాట్లాడుతూ ఇదివరకే ఓటరు జాబితాలో పేర్లు నమోదు కోసం బూత్ లెవెల్ అధికారులు 18 ఏళ్లు నిండిన వారితో ఫారం–6 దరఖాస్తులను స్వీకరించారని, వాటిని వెంటనే కార్యాలయాల్లో సమర్పించాలన్నారు. అలాగే కొత్తగా ఎవరైనా జాబితాలో చేరడం కోసం అక్టోబర్ 15వ తేదీ తర్వాత ఫారం–6 స్వీకరించాలన్నారు. ఓటరు జాబితాలో పేర్లు ఏమైన తప్పుఒప్పులు ఉంటే బీఎల్ ఓలు, వీఆర్వోలు సంయుక్తంగా కలిసి సరిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ భాగ్యలక్ష్మీ, బీఎల్‌ఓలు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.